తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 137
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
బుధవారం, 06-12-2023



జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్ లో నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889




తెలంగాణ నూతన సీఎం ఉత్కంఠకు తెరపడింది..
రేవంత్ రెడ్డిని సీఎంగా ప్రకటించింది కాంగ్రెస్ అధిష్టానం..
ఈ నెల 7న రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు..

# తెలంగాణ సీఎంగా రేవంత్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ఎన్నుకున్నామని తెలిపింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కాంగ్రెస్ అగ్రనేతలతో జరిగిన భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం రేవంత్ రెడ్డిని సీఎంగా ఎంపిక చేసినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. రేపు రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. . భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో రేవంత్ రెడ్డిని సీఎల్పీ నేతగా ఎన్నుకున్నట్లు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. కాంగ్రెస్ లో ఎప్పుడూ వన్ మ్యాన్ షో ఉండదని, అందరూ ఒక టీమ్ ముందుకు సాగుతామన్నారు.

## ఢిల్లీ బయలుదేరిన రేవంత్ రెడ్డి

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఎల్లుండి రాజ్ భవన్ లో జరిగే ప్రమాణ స్వీకారానికి సోనియా, రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి పేరు ప్రకటించడంతో ఆయన నివాసం వద్ద భద్రత పెంచారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణా రావు తర్వాత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నెల 7న ఎల్బీ స్టేడియంలో సీఎం ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరగనుంది. ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## రేవంత్ రెడ్డి ప్రస్థానం

- తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం మారు మోగుతున్న ఒకే ఒక పేరు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీలో ఆయన ఒక క్రౌడ్ పుల్లర్, ఆయన మాటలతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారు. పార్టీలో చేరిన అతి తక్కువ కాలంలోనే కోట్ల మంది ప్రజాదరణ పొంది అగ్ర స్థాయికి ఎదిగారు. ముళ్లబాట నుంచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే స్థాయికి ఎలా ఎదిగారో ఓసారి చూద్దాం.
- అనుముల నర్సింహారెడ్డి, రామ చంద్రమ్మ దంపతులకు నవంబర్ 8, 1969 న అనుముల రేవంత్ రెడ్డి జన్మించారు. రేవంత్ రెడ్డి స్వస్థలం కొండ రెడ్డి పల్లి గ్రామం, వంగురు మండలం, నాగర్ కర్నూల్ జిల్లా. రేవంత్ రెడ్డి ఏవీ కాలేజ్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నాడు. ఆయనకు భార్య గీతా రెడ్డి, కుమార్తె నైమిష రెడ్డి ఉన్నారు.

## రాజకీయ ప్రస్థానం

- 2007 జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీ వంటి పార్టీలను మట్టికరిపించి ఉమ్మడి మహబూబ్ నాగర్ జిల్లాలోని మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి తొలి విజయంతోనే అందరి చూపునూ తన వైపు తిప్పుకున్నారు.
- ఆ తరువాత వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరమని ఆహ్వానించినా.....రేవంత్ రెడ్డి సున్నితంగా ఆహ్వానాన్ని తిరస్కరించి చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో చేరారు.
- 2009లో కొడంగల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి కాంగ్రెస్ సీనియర్ నేత రావులపల్లి గుర్నాథ్ రెడ్డి పై విజయం సాధించారు.
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్ రెడ్డి, 2017 వరకు టీడీపీ లెజిస్లేచర్ పార్టీ నేతగా కొనసాగి సభలో అధికార పక్షానికి ముచ్చెమటలు పట్టించారు.
- 2017 అక్టోబర్ నెలలో టీడీపీకి రాజీనామ చేసిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ లో చేరిన అనంతరం మూడేళ్ల పాటు ప్రజా సమస్య లే అజెండాగా ముందుకు సాగారు.
- రేవంత్ ప్రతిభను, జనంలో ఆయనకు ఉన్న ఆదరణను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం... ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన......ఆ తరువాత వచ్చిన పార్లిమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు.
- జూన్ 26,2021 న కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమించింది. 2021 జూలై 7న నాటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మాణిక్యం ఠాకూర్ సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేశారు.
- కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేవంత్ రెడ్డికి దక్కిందని కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అసంతృప్తితో ఉన్న అధిష్ఠానం సహకారంతో నేతలందరినీ ఒకతాటిపైకి తెచ్చారు.
- ఇక తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అందరినీ కలుపుకుని ప్రచారం చేశారు. ఫలితంగా రాష్ట్రంలో కాంగ్రెస 64 స్థానాలను దక్కించుకొని విజయపతాక ఎగరవేసింది.
- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవ్వడానికి ముఖ్య కారకుడిగా నిలిచిన రేవంత్ రెడ్డినే సీఎం అభ్యర్థిగా ప్రకటించింది కాంగ్రెస్ అధిష్టానం.



# 20 ఏళ్ల తర్వాత.. ఆ ఇల్లు ఖాళీ

**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :**

రెండు దశాబ్దాలుగా దేశ రాజధాని ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉన్న తుగ్లక్ రోడ్డులోని 3వ నెంబరు ఇంటిని ఖాళీ చేస్తున్నారు. ఢిల్లీలోని తన అధికార నివాసంతో మాజీ సీఎం కేసీఆర్ 20 ఏళ్ల అనుబంధానికి తెరపడింది. 2004 నుండి ఢిల్లీలోని తుగ్లక్ రోడ్లోని ఇల్లు అప్పట్లో కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పటి నుండి అధికారిక నివాసంగా ఉంది. ఆ తర్వాత సీఎంగా ఉన్న సమయంలో ఆ ఇంటిని


మిగతా 2 లో

# ఇస్రో.. మరో ఘనత

**జయభేరి, శ్రీహరికోట, డిసెంబర్ 5:**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోమరో ఘనత సాధించింది. చంద్రయాన్ 3 ప్రాజెక్టులో భాగంగా జాబిల్లి వద్దకు పంపిన CH3 ప్రొపల్షన్ మాడ్యూల్ ను విజయవంతంగా చంద్రుడి కక్ష్య నుంచి భూ కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలు వివరాలు వెల్లడించారు. ఇది ప్రత్యేక ప్రయోగమని పేర్కొన్నారు. చంద్రుడిపై నమూనాలు సేకరించే ప్రణాళికలు చేస్తోన్న ఇస్రోకు, తాజా ప్రయోగం చాలా దోహదపడుతుందని తెలిపారు. జాబిల్లి నుంచి నమూనాలు సేకరించి తిరిగి వచ్చే మిషన్ కోసం వ్యూహాలు రూపొందించేందుకు ఈ ప్రొపల్షన్ మాడ్యూల్ లోని సమాచారం ఉపయోగపడుతుందని

మిగతా 2 లో





# పనిచేసే ప్రభుత్వాన్ని కోల్పోయాం..

- కేసీఆర్, కేటీఆర్కు అండగా ఉందాం..
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చి, అభివృద్ధి చేసింది కేసీఆరే
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు మద్దతుగా
- సోషల్ మీడియాల్లో నెటిజన్ల ట్వీట్లు

2 లో



# తెలంగాణపై తుపాను ప్రభావం

## అవసరమైన సహాయ చర్యలు తీసుకోండి- రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**

మిచౌంగ్ తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మిచౌంగ్ తుపాను ప్రభావం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందిగా టీపీసీసీ అధ్యక్షుడు, కాబోయే సీఎం రేవంత్ రెడ్డి అధికారులను కోరారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో జన జీవనం స్తంభించకండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలు ప్రాంతాల్లో వరి ధాన్యం తడిచిపోయే అవకాశం ఉందని, దీనిపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. ఎక్కడికక్కడ రైతులకు అండగా నిలిచి, పలు సూచనలు చేయాల్సిందిగా కోరారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. "ములుగు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో తుపాను కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలరెట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, జనగాం, నల్గొండ, యాదాద్రి, భూపాలపల్లి, సిద్ధిపేట, నాగర్ కర్నూలు, వనపర్తి,

మిగతా 2 లో

## జయభేరి అక్షర తూటా



గర్జించిన గొంతే...
ఒక అవకాశం ఉంది తెలంగాణకు
తొలి పొద్దుపొడుపు అయ్యింది

బానిస బతుకుల నుంచి బడి సెలందుకొని
నాటి తెలంగాణ పోరనుండి నేడు
మరి దశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అందుకున్న
తెలంగాణ బిడ్డలు మార్పు కోరుకున్నారు...
మరో బంగారు తెలంగాణకు ద్వారాలు తెరిచారు..

చూద్దాం...
కాంగ్రెస్ పాలన పనితీరు
ఆరు గ్యారెంటీల అమలు...

...కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889

'జయభేరి' కౌంటర్ విత్ కడారి కామెంట్స్



... 2 లో



## ఈ గెలుపు ప్రజల ఆత్మగౌరవానిదే..!

2 లో



## ప్రభుత్వ భూములకు రెక్కలు

3 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## 20 ఏళ్ల తర్వాత.. ఆ ఇల్లు ఖాళీ

అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హస్తినలోని కేసీఆర్ అధికారిక నివాసాన్ని సిబ్బంది ఖాళీ చేస్తున్నారు.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతున్న సమయంలో కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక భవనాలను ఖాళీ చేయాల్సిందే. ఇప్పటికే పలువురు మంత్రులు, ఓడిపోయిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ అధికారిక భవనాలను ఖాళీ చేస్తున్నారు. క్యాంపు కార్యాలయాల్లోనే తమ సామాగ్రిని తరలిస్తున్నారు. సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్ను కూడా కేసీఆర్ ఖాళీ చేయాల్సిందే. ఇప్పటికే ఆయన ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్కి వెళ్లారు. ప్రస్తుతం అక్కడి నుంచే పార్టీ కలాపాలు చూసుకుంటున్నారు.రాష్ట్రంలో గెలిచిన తర్వాత కేసీఆర్ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. సీఎం హోదాలో హస్తినకు వచ్చినప్పుడల్లా ఈ ఇంట్లోనే ఉండేవారు. అధికారం కోల్పోయిన ఏ ప్రజాప్రతినిధి అయినా తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడానికి ఒక నెల సమయం ఉంటుంది. కానీ, కేసీఆర్ ఆదేశాల మేరకు రెండు మూడు రోజుల్లో ఇల్లు పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ఆ ఇల్లు ఖాళీగా ఉంటే రెండు దశాబ్దాలుగా ఈ ఇంటితో కేసీఆర్కు ఉన్న సంబంధం తెగిపోతుంది. 2004లో టీఆర్ఎస్ తరఫున కరీంనగర్ నుంచి ఎంపీగా ఎన్నికై మన్మోహన్సింగ్ కేబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా కేసీఆర్ పనిచేశారు. ఆ సమయంలో కేంద్ర మంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు తుగ్లక్ రోడ్డులోని టైప్ 8 క్వార్టర్ను కేటాయించింది. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన కేసీఆర్.. ఉప ఎన్నికల్లో ఎంపీగా గెలిచి అదే సభలో కొనసాగారు. 2009లో మహబూబ్నగర్ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన అదే నివాసంలో ఉంటున్నారు.2014లో తెలంగాణ సీఎం అయిన కేసీఆర్.. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో అధికారిక నివాసాలను కేటాయిస్తుంది కేంద్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా అదే నివాసాన్ని కేసీఆర్ కు కేటాయించారు. ఆ క్వార్టర్ ముఖ్యమంత్రి, ఎంపీ కవితకు అధికారిక నివాసంగా మారింది. 2018లో కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత అదే నివాసంలో కొనసాగారు. తాజాగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కవితకు ప్రస్తుతం ఎంపీ పదవి కూడా లేదు. దీంతో ఢిల్లీలోని ప్రభుత్వ నివాసాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇల్లు ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా రెండు మూడు రోజులు పడుతుందని బీఆర్ఎస్ వర్గాలు కేంద్ర ప్రభుత్వ అధికారులకు నివేదించినట్లు సమాచారం

## ఇస్రో.. మరో ఘనత

పేర్కొంది. చంద్రుడి కక్ష్యలోకి ల్యాండర్ ను చేర్చడంలో ఈ మాడ్యూల్ కీలక పాత్ర పోషించింది. జాబిల్లిపై 3 నెలలు కక్ష్యలో పని చేసేలా ఈ మాడ్యూల్ తయారు చేశారు. తాజా ప్రయోగంతో చంద్రుడిపైకి అంతరిక్ష నౌకలను పంపడమే కాకుండా వాటిని తిరిగి భూమికి తీసుకు రావడంలో కీలక ముందడుగు పడిందని శాస్త్రవేత్తలు తెలిపారు. 'చంద్రయాన్ 3' మిషన్ లక్ష్యాలు పూర్తిగా నెరవేరినట్లు స్పష్టం చేశారు. ఈ తరహా ప్రయోగాన్ని తొలిసారి చేసి ఇస్రో విజయం సాధించింది. ఇప్పటివరకూ వేరే కక్ష్యల్లోకి స్పేస్ క్రాఫ్ట్ లను పంపించటమే తప్ప వాటిని తిరిగి తీసుకువచ్చే టెక్నాలజీ ఇస్రో దగ్గర లేదు. కనుక ఈ విజయం ఇస్రో చరిత్రలో ప్రత్యేకంగా నిలవనుంది.ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి LVM M4 వాహనంలో జులై 14, 2023న చంద్రయాన్ 3 మిషన్ ను ప్రయోగించారు. అది భూమి చుట్టూ తిరుగుతూ మెల్లగా కక్ష్యను పెంచుకుని చంద్రయాన్ 3 స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. దాదాపు నెల రోజుల తర్వాత అంటే ఆగస్టు 17న ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యుల్ వేరైంది. ఆ తర్వాత ఆగస్టు 23న ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగి చరిత్ర సృష్టించింది. చంద్రుడిపై ఓ రోజు పాటు పని చేసిన విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్ ఎన్నో ప్రయోగాలు చేసి భూమి మీదకు డేటాను పంపించాయి. చంద్రుడిపై ఓ రోజు అంటే భూమిపై 14రోజులు కాబట్టి.. ఆ తర్వాత చంద్రుడిపై చీకటి పడే సమయం కావటంతో ఇస్రో ల్యాండర్, రోవర్ ను స్లీప్ మోడ్ లోకి పంపించింది. 14రోజుల తర్వాత వాటిని మేల్కొలిపే ప్రయత్నం చేసినా చంద్రుడిపై ఉన్న అతి శీతల పరిస్థితుల కారణంగా ల్యాండర్, రోవర్ శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయాయి. అయినప్పటికీ ఇస్రో సాధించాల్సిన ఘనతలను ఆ 14 రోజుల్లోనే సాధించింది. ఈ ప్రయోగం సక్సెస్ తో చందమామ సౌత్ పోల్పై కాలు మోపిన మొదటి దేశంగా భారత్ నిలిచింది. ఇప్పుడు ల్యాండర్ మాడ్యూల్ నుంచి విడిపోయిన ప్రొపల్షన్ మాడ్యూల్ ను తిరిగి ఉపయోగించుకునేందుకు ఓ కొత్త ప్లాన్ వేసింది ఇస్రో. ప్రొపల్షన్ మాడ్యూల్ లో SHAPEపే లోడ్ ఉంది. ఫైనల్ గా నవంబర్ 22న భూమి కక్ష్యలోకి వచ్చి భూమి చుట్టూ ఆర్బిట్ ను ప్రొపల్షన్ మాడ్యూల్ పూర్తి చేసిందని ఇస్రో ప్రకటించింది. కక్ష్య తగ్గించే సమయంలో భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న స్పేస్ క్రాఫ్ట్ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుని విజయవంతమైనట్లు తెలిపింది. స్పేస్ ఏజెన్సీస్ సాధించాల్సిన లక్ష్యాల్లో స్పేస్ క్రాఫ్ట్స్ ను పంపించటమే కాదు వాటిని తిరిగి సేఫ్ గా వెనక్కి తీసుకువచ్చే సామర్థ్యం సాధించటం చాలా ముఖ్యమైంది. విజయవంతం కావడంతో భవిష్యత్తులో దీని ఆధారంగా టెక్నాలజీని మరింత ఇంప్రూవ్ చేసుకుని ఇస్రో సరికొత్త ప్రయోగాలు చేసేందుకు ఆస్కారం లభించనున్నట్లు సైంటిస్టులు తెలిపారు.

## పనిచేసే ప్రభుత్వాన్ని కోల్పోయాం..

బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణ పనిచేసే మంచి ప్రభుత్వాన్ని కోల్పోయిందని నెటిజన్లు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాతీర్పును శిరసావహిస్తూనే.. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్రావుకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోపాటు పార్టీకి వెన్నంటి ఉంటామని పేర్కొంటున్నారు. ఈ మేరకు సోషల్మీడియాల్లో పోస్టులతో హోరెత్తిస్తున్నారు. ఆరునూరైనా గులాబీ జెండా విడిచేది లేదని బీఆర్ఎస్ అభిమానులు తేల్చి చెప్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేతతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్కు అండగా ఉండాల్సిన బాధ్యత, సమయం ఆసన్నమైందంటూ నెటిజన్లు ట్వీట్లు చేస్తున్నారు. 'తెలంగాణను నిజంగా ప్రేమించే నాలాంటి వారెందరో కలలో కూడా ఊహించని ఈ చేదు నిజాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంది' అని ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. కేసీఆర్కు వెన్నుదన్నుగా నిలుద్దాం అని రాసుకొచ్చాడు. 'ప్రజా తీర్పును హుందాగా గౌరవిస్తున్నారు. బాధపడకండి.. మనం తెలంగాణ రాష్ట్ర బాగు కోసం ఎప్పటికీ పోరాడుతూనే ఉందాం. పోరాటాలు, ఉద్యమాలు మనకేం కొత్త కాదు' అని ఓ నెటిజన్ కేసీఆర్కు మద్దతుగా నిలిచాడు. 'నేటి ఓటమి.. రేపటి గెలుపు.. ఓడిపోయింది అభ్యర్థులే.. అభ్యర్థుల ధైర్యం ఏమాత్రం కాదు..' అని ఓ యువతి పోస్టు పెట్టింది. 'నిరంతరం శ్రమతో..నూతన ఆలోచనలతో నా తెలంగాణ కోటి రతనాల వీణ అని చెప్పుకునే స్థితిలో నిలబెట్టిన నేతకు అండగా ఉండాలి' అని ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. 'ప్రాణమున్నంత వరకూ గులాబీ జెండా వదిలేదే లేదు. మీరు మీ శాయశక్తులా పోరాడిన తీరు అమోఘం.. నేను చాలా దగ్గరగా మిమ్మల్ని అనుసరించాను.. మీ పనితనం గ్రేట్' అంటూ మరొకరు ట్వీట్ చేశారు. 'గెలుపోటములు సహజమే అయినా.. ఉద్యమ నాయకులు కేసీఆర్, కేటీఆర్కు అండగా ఉండాల్సిన సమయమిది' అని ఒకరు పోస్ట్ పెట్టి మద్దతుగా నిలిచారు. రాజకీయాలకతీతంగా చూస్తే భారతదేశంలోనే ఇప్పటివరకూ ఉన్న అత్యుత్తమ ఐటీ మినిస్టర్లలో ఒకరైన కేటీఆర్ను కోల్పోయామని దేశాయ్ అనే నెటిజన్ ట్వీట్ చేశారు. 'కేటీఆర్గారూ.. ఇండియాలోనే ఉత్తమమైన ఐటీ మినిస్టర్ సార్ మీరు. మినిస్టర్ల గురించి మాట్లాడాల్సి వస్తే మొదట మీ పేరే వస్తుంది' అని అన్వేష్ కొండపల్లి అనే యూజర్ పోస్ట్ పెట్టారు. 'ప్రజా తీర్పును గౌరవిద్దాం.. కానీ ఐటీ మంత్రిగా మిమ్మల్ని తప్ప ఎవరినీ ఊహించుకోలేను. 5 ఏండ్లు మీ వాయిస్ మిస్ అవుతున్నది. మళ్లీ గొప్ప శక్తితో తిరిగి రండి' అంటూ శ్రీ అక్కి అనే నెటిజన్ కేటీఆర్కు మద్దతుగా ట్వీట్ చేశారు. నెటిజన్లందరూ ఐటీ మినిస్టర్ హ్యాష్ట్యాగ్లతో కేటీఆర్కు మద్దతుగా ట్వీట్లు, పోస్టుల వర్షం కురిపించారు.

## తెలంగాణపై తుపాను ప్రభావం


నారాయణ పేట్, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. ఐఎండీ అలర్ట్ లకు అనుగుణంగా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" రేవంత్ రెడ్డి వరి ధాన్యం ఆరబెట్టుకున్న రైతుల విషయంలో ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే టార్పాలిన్లు ప్రొవైడ్ చేయగలుగుతామా, ఇతర ముందు జాగ్రత్తలు ఏమైనా సూచించగలుగుతామా అనేది చూడాలి. ఈశాన్య జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నందున అక్కడి అధికారులను అప్రమత్తం చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవాహాన్ని ముందే అంచనా వేసి, ఇబ్బంది తలెత్తే పరిస్థితి ఉంటే, అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. తుపాను పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం, సురక్షిత నీరు అందేలా చూడాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. విద్యుత్, రహదారులు దెబ్బతిన్న ప్రాంతాలు ఏమైనా ఉంటే వెంటనే పునరుద్ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పురాతన భవనాలు, నిర్మాణాలు ఏమైనా ఉంటే ముందే గుర్తించి అక్కడ నివసించే వాళ్లను ఖాళీ చేయించాల్సిందిగా సూచిస్తున్నానని అని రేవంత్ రెడ్డి అన్నారు.

### కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్

### అహంకారానికి ఆత్మగౌరవానికి మధ్య జరిగిన పోరాటం..

# ఈ గెలుపు ప్రజల ఆత్మగౌరవానిదే..!

**అహంకారానికి, ఆత్మ గౌరవానికి జరిగిన పోరాటం.. తెలంగాణ చరిత్రలోనే ఇదో మరపురాని ఘట్టం.. చరిత్రలో ఎంతోమంది నేతలు ప్రజాస్వామ్యం పరిపాలనలో తమ ఉనికిని చాటుకున్నారు... వారిలో జ్యోతి బస్ ఏకంగా 27 ఏళ్లు పరిపాలన కొనసాగించి ప్రజా మన్ననలను పొందుకున్నాడు.. అలాంటి కోవలోనే వస్తాడు అనుకున్న కెసిఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాలకి ఎందుకు ప్రజల మనసులో స్థానాన్ని సంపాదించుకోలేకపోయాడు.. అది స్వయంకృత అపరాధమ!? కుటుంబంలోని వ్యక్తులు ఆయనను ఒత్తిడి చేసి పరాభవానికి గురి చేశారా!? పాలన పరిపాలకులుగా ఎన్నికైన ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకన!? ఏక పక్ష నిర్ణయాలే కొంప ముంచాయ ? ఇలాంటి ఎన్నో విషయాలపై జయభేరి కుండబద్దలు కొట్టే నిజాలను కౌంటర్ విత్ శ్రీనివాస్ కథనం...**





...✍ కడారి శ్రీనివాస్
సీనియర్ రాజకీయ విశ్లేషకులు
9848 962 799

(నిన్నటి తరువాయి)

**బిడ్డ పుడితే తల్లికి కెసిఆర్ కిట్టు లాంటి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాడు... అంతేకాదు రైతులకు రైతు బీమా రైతు బంధు లాంటి ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు రైతుకు పెట్టుబడి సహాయం కింద రైతుబంధును అందించి రైతన్నను తలెత్తుకునేలా దేశ చరిత్రలో ఎవ్వరు రైతుకు చేయలేని సహాయాన్ని ధైర్యంగా చేశాడు కేసీఆర్... అదే దిశగా బడుగు బలహీనులకు డబల్ బెడ్ రూమ్ లో అందించాలని ఒక గొప్ప నిర్ణయంతో డబల్ బెడ్ రూములు కట్టి తెలంగాణ ప్రజలకు పంచాడు. దళితుల ఆత్మగౌరవానికి దెబ్బ తగలకుండా వారిని ఆర్థిక రంగంలో ముందుకు తీసుకురావడానికి వ్యాపారంలో ఉత్తీర్ణులుగా చేయడానికి దళిత బంధువుగా మారి 10 లక్షల రూపాయలను వారికి గిఫ్ట్ గా అందించాడు. ఇలాంటి ఎన్నో ఎన్నెన్నో సంక్షేమ పథకాలను అందించిన సీఎం కేసీఆర్ వాటి కార్యాచరణ ఇంప్లిమెంటేషన్ సరిగ్గా లేకపోవడం వలన అదే ఆయనకు ఒక మాయని మచ్చగా చరిత్రలో చెడ్డ పేరును తీసుకొచ్చాయి.**

2014 నుండి 2018 వరకు సీఎం కేసీఆర్ తన మేనిఫెస్టోలో ప్రకటించని ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను సైతం అందించిన కానీ తెలంగాణ ప్రజలు ఆయనను ముచ్చటగా మూడవసారి సీఎంగా చూసేందుకు ఇష్టపడలేదు...ఎందుకంటే ముఖ్యంగా ఎప్పుడైతే తెలంగాణ రాష్ట్ర సమితి టిఆర్ఎస్ గా ఉన్న పార్టీని ప్రజలు ఆదరించారు అభిమానించారు. అక్కున చేర్చుకొని అధికారాన్ని కట్టబెట్టారు... టిఆర్ఎస్ కాస్త బి.ఆర్.ఎస్ గా మారిన తరువాత తెలంగాణ ప్రజలు ఆ సెంటిమెంటును వదులుకోలేక టిఆర్ఎస్ను కాదనలేక నలిగి విసిగి వేసారి పార్టీకి దూరంగా వెళ్లిపోయారు... రాష్ట్రంలో సీఎంగా ఉంటూ తన జీవితాన్ని సుస్థిరం చేసుకోలేని సీఎం కేసీఆర్ అసమర్థుడా!? రాజకీయ అపరచానిక్యుడా!?అనే విషయాల్ని తమకు తామే వేసుకుని పార్టికి దూరంగా ఉంటూ వచ్చారు.


**భారతదేశంలోని 29 రాష్ట్రాలలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలు కేవలం నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలోనే ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత ఆనాటి సీఎం కేసీఆర్కే ఉంటుంది.. ఇది నిజం తెలంగాణ పల్లెల్లో ప్రతి ఇంటిలో ఒక సంక్షేమ పథకం అందే ఉంటుందన్న నమ్మకాన్ని సీఎం కేసీఆర్ కల్పించాడు. ఇది ఆయన పనితీరుకు నిదర్శనంగా మారిపోయింది.. కానీ మూడవ సారి సీఎంగా అవకాశాన్ని ప్రజలు ఎందుకు దూరం చేశారు!? ఆయన ఓటమికి గల కారణాలేంటి!? కుటుంబ కుటుంబంలోని వారసులే ఆయన రాజకీయ జీవితాన్ని సమాధి చేశారా!? అన్న సందేహాలు బీఆర్ఎస్ అభిమానులకు కలుగుతున్నాయి.**

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలతో సీఎం కేసీఆర్ నిర్ణయాలు తీసుకొని భారతదేశ చరిత్రలోనే చిన్న రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కాపీ కొట్టి అందించేంతగా కెసిఆర్ పరిపాలన ఆదర్శంగా మారిపోయింది.. అలాంటి పరిపాలన 2018 లో మళ్ళీ అధికారంలోకి వచ్చాక రెండవసారి పరిపాలన అహంకార పూరితమైనదిగా ఎవరిని లెక్క చేయడు అనే విధంగా మారిపోయిందని అనుమానాల మధ్య సీఎం కేసీఆర్ పరిపాలన రెండవ సారి కొనసాగింది. అంతేకాదు తాను ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం పూర్తిగా స్వార్థ పూరితమైనదిగా తమ పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరేలా చేశారు అనే ఆరోపణలు గట్టిగా ఆయన ఎదుర్కొన్నాడు... నాడు తెలంగాణ ఉద్యమంలో ఎదుర్కొన్న అవమానాల కంటే రాష్ట్ర సాధించి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి రెండవసారి అధికారం చలాయిస్తున్న సమయంలో వచ్చిన ఆరోపణలను ఆయన అసలు లెక్క చేయలేదు.. ఇది కెసిఆర్ రాజకీయ జీవితానికి దూరం చేసేలా అడుగులు పడ్డాయని ఆనాడు తన ఊహించలేదు... ముఖ్యంగా తన కుటుంబంలోని వారందరికీ మంత్రులుగా ఎమ్మెల్యేలుగా చేసుకుని బిఆర్ఎస్ పార్టీ అంటే అది కుటుంబ పార్టీగా మారిపోయింది అనే వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ నిజమే మాది కుటుంబ పార్టీ అని తెలంగాణ ప్రజలంతా మా కుటుంబ సభ్యులే అని సమర్థించుకున్న దాని వెనక స్వార్థపూరితమైన ఆలోచనలే ఉన్నాయన్న నిజాన్ని తెలంగాణ ప్రజలు గ్రహించారు.. అందుకే ప్రతి పథకంలోని లొసుగులను ఎత్తి పట్టి మరి ప్రభుత్వానికి కనపడేలా ఆయా సోషల్ మీడియా ద్వారా ఎన్నో ఎన్నెన్నో తప్పులను మోసాలను కేసీఆర్ కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. కానీ కెసిఆర్ అనాడు చేసింది ఏమిటి!? తన ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని తెలంగాణ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల స్వార్థపూరితమైన రాజకీయానికి చరమగీతం పాడుదామని హెచ్చరించిన కేసీఆర్ అసలు పట్టించుకోలే!? ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించుకుంటున్నారు ఇది తెలంగాణ ప్రజల సొమ్ము అని ఎన్నోసార్లు సోషల్ మీడియా వేదికగా తమ గొంతును వినిపించిన కేసీఆర్ పట్టించుకోకపోగా మూడవసారి ఎన్నికల్లో వారికే టికెట్టును మళ్ళీ కట్టబెట్టడం తెలంగాణా ప్రజలకు ససేమిరా నచ్చలేదు.... అంటే ఇది కేసీఆర్ దొర పాలనకు నిదర్శనంగా మారిపోయిందని తెల్చేసుకుని తీర్పుని అందించారు !

**నిజాన్ని నిర్భయంగా మాట్లాడగలిగి ఎత్తి చూపించే తెలంగాణ పోరాట బిడ్డల ఆత్మ గౌరవం దెబ్బతినేలా కొనసాగిన, 2018 రెండవసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ తీరు పూర్తిగా అహంభావపూరితమైన పోకడలతో నియంతలా మారిపోయింది. కేసీఆర్ పరిపాలనను తెలంగాణ ప్రజలు చీదరించుకున్నారు.. కెసిఆర్ అంటే ఇప్పటికీ తెలంగాణ ప్రజలకు అభిమానం గౌరవం ఎంతో ఉంది... కానీ ఆ గౌరవాన్ని తానే పోగొట్టుకునే స్థితిలో అధికార దాహంతో అహంకార స్వభావానికి లోనై తనను తాను మరిచిపోయి, ఉద్యమ నాయకుడిగా ఉన్న పనితీరును మరిచిపోయి, నేనే తెలంగాణ సీఎం, నాదే ఈ తెలంగాణ, తెలంగాణ అంటే కెసిఆర్, కెసిఆర్ అంటే తెలంగాణ, అనే0తగా తెలంగాణ ప్రజలను తన వైపు తిప్పుకున్నాడు... అంతేకాదు తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రత్యేకగా నిలిచే వేడుక బతుకమ్మ పండుగ... అలాంటి బతుకమ్మ పండుగను ఖండాంతరాలు దాటించిన, అనే ఘనతను చెప్పుకుంటూనే బతుకమ్మ అంటే కవిత కవిత అంటే బతుకమ్మ అనే అంతలా తన బిడ్డపై మమకారంతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడు...**

తన కడుపున పుట్టిన బిడ్డలు కేటీఆర్ కవిత ఎన్నో సందర్భాల్లో ఆయనకు చిక్కులు తెచ్చిపెట్టిన కడుపులో దాచుకొని కాపాడాడే కానీ వారిని రాజకీయం నుంచి దూరం చేయలేకపోయాడు...ఎందుకంటే ఆనాడు ఆయన అన్న మాటలే తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదు.... దళిత సీఎంని చేస్తానాకెందుకు పదవి నేను నా ముసల్దీ ఇద్దరికీ సరిపోను ఆస్తి ఉంది, నా కొడుకు నా బిడ్డ విదేశాల్లో ఉన్నారు, నాకు అవసరం లేదు తెలంగాణ బిడ్డలు బాగుపడితే చాలు, అని చెప్పుకొచ్చిన ఆ పెద్దమనిషి.. అధికారం వచ్చాక పూర్తిగా మారిపోయాడు... అధికారం వచ్చాక మారిపోవడం సహజం.. కానీ కెసిఆర్ ని ప్రజలు అభిమానించారు గౌరవించారు, అందుకే ఆయన అంతలా అహంకార పూరితంగా మారిపోవడాన్ని ప్రజలు తట్టుకోలేకపోయారు... ఎందుకంటే నైజాము సర్కరుని గోరి కడతాం అని పాటలతో ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకొచ్చిన తెలంగాణ నేల ఇది... మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాట ప్రస్థానం అంత ఇంత కాదు...ఇలా ఎన్నో సంగతులు తెలిసిన సీఎం కేసీఆర్ తప్పులెన్నో వారు తమ తప్పులేరు గరయ్యా అనే నానుడిని నిజం చేశారు.. అందుకే 2023 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలు మార్పు కోరుతూ తెలంగాణ ఆత్మ గౌరవానికి అహంకారపూరితమైన పాలనకు జరిగిన పోరాటంలో ఆత్మ గౌరవం గెలిపించుకొని తెలంగాణ ప్రజలే గెలిచారు... అందుకే తెలంగాణ అంటేనే ఒక ప్రత్యేకమైన రాష్ట్రం ఒక ప్రత్యేకమైన స్వభావం ఒక ప్రత్యేకమైన అభిమానం ఒక ప్రత్యేకమైన సెంటిమెంట్...ఇలాంటి ప్రజలను పరిపాలించాలంటే ఎంతో ఓపిక ఎంతో సహనం సుదీర్ఘ రాజకీయ జీవిత అనుభవం కావాలి... నిజానికి జ్యోతిబసులాగా 27 ఏళ్లు పరిపాలన కొనసాగిస్తాడు అనుకున్న సీఎం కేసీఆర్ కేవలం 10 సంవత్సరాల్లోనే తన రాజకీయ జీవితానికి తానే సమాధిని తోడుకున్నారు... ఇది తెలంగాణ చరిత్ర మరిచిపోని ఘట్టం... మార్పును కోరుకున్న తెలంగాణ ప్రజల విజయం...ఆత్మ గౌరవ నినాదపు విజయం.

2023 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఓడిపోయిన, తెలంగాణ ప్రజల్లో ఆయన శాశ్వతంగా నిలిచిపోతారు. తెలంగాణ రాష్ట్రంలో తనదైన పరిపాలన పనితీరును కొనసాగించిన సీఎం కేసీఆర్, తమ నాయకులు చేసిన తప్పిదాలు, ఆయనకు శాపంగా మారిపోయాయి. ఎమ్మెల్యేల అవినీతి ధనదాహం భూకబ్జా చేతివాటం ప్రకృతి వనరుల దోపిడిని ప్రజలు సహించి సహించి ఓపిక నశించి 2023 ఎన్నికల్లో మార్పును కోరుకున్నారు... ఒక్క మాటలో చెప్పాలంటే ఆత్మగౌరవానికి అహంకారానికి జరిగిన పోరాటంలో తెలంగాణ ఆత్మ గౌరవం తెలంగాణ ప్రజలు మరొక్కసారి నిలబెట్టుకున్నారు మార్పును కోరుకున్నారు.... కెసిఆర్ వ్యక్తిగతంగా ప్రజలకు ఎప్పుడు దగ్గరగానే ఉంటారు. ఇక ఇప్పుడు ప్రగతి భవన్ కాస్త డాక్టర్ అంబేద్కర్ ప్రజా భవన్ గా మారనుంది. సామాన్యులు సైతం అక్కడికి వెళ్లి తమ సమస్యలను చెప్పు కునే విలు ఉంటుంది.. ఏదేమైనా తెలంగాణా ప్రజల పోరాటం ఎన్నటికి ఆగిపోకూడదు.నిరంతరం పోరాటమే ఉపిరిగా మార్చుకున్న తెలంగాణా బిడ్డలు ఉద్యమ రణ ధీరులే... పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలానికి వారసులే.....



# బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

**జయభేరి, డిసెంబర్ 5:**

బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్ జిల్లా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. మచ్చబొల్లారం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడవో కార్యక్రమంపై బాలలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా వాసవి హాజరై మాట్లాడుతూ బాలలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సైతం ఆడపిల్లలను అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. బాలికలను చదివిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని వారు తెలిపారు. అనంతరం బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలు, ఫోక్సో చట్టం, చైల్డ్ లైన్, సఖి సెంటర్, హెల్ప్ లైన్ నంబర్ 100, 181, 1098, 14567 పై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ రాజు, ఉపాధ్యాయులు, మహిళా సాధికారత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







# అయ్యప్ప మహా పడి పూజకు ఆహ్వానం

**జయభేరి, డిసెంబర్ 5:**

కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను మాలధారణ గావించిన భక్తులు ఎంతో నియమ నిష్టలతో పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 10న యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేని పల్లి గ్రామంలోని దుర్గమ్మ ఆలయం వద్ద 18వ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. కేరళ గురుస్వామి మోహన్ దాస్ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు నరేళ్ల పల్లి లక్ష్మయ్య శర్మ, హరిబాబులు కలసి ఈ మహా పడి పూజ కార్యక్రమం చేయనున్నట్లు గురు స్వాములు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి, కందడి మహిపాల్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి, కేశవపూర్, మూడు చింతల పల్లి గ్రామాల అయ్యప్ప దీక్ష స్వాములను ఆహ్వానించినట్లు వారు వెల్లడించారు. పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.





## మల్లారెడ్డి ని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ ఎమ్మెల్యే గా రెండవ సారి గెలుపొందిన చామకూర మల్లారెడ్డి ని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లారెడ్డి నివాసంలో మెడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు తో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ అభివృద్ధి మల్లారెడ్డి తోనే సాధ్యం అన్నారు.

# ప్రభుత్వ భూములకు రెక్కలు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ కలాన్ కళ్యాణ్ పూరి సీతారామ కాలనీ లో గల 1200 గజాలు (సుమారు 12 కోట్లు) కబ్జాకు గురి అయినది. సీత రామ కాలనీ సర్వేనెంబర్ 789/1. ఈ సర్వే నెంబర్ లో దాదాపుగా 56 ఎకరాలు ఉంటుంది. 15 ఎకరాలు ఇతర కాలనీలకు పోగా.. మిగతా 30 ఎకరాలు గవర్నమెంట్ ల్యాండ్ అలాగే ఉంది. ఈ ల్యాండ్ ను గత 30 సంవత్సరాలుగా రసూల్ ఖాన్ వారి కుటుంబ సభ్యులు రాజకీయ నాయకుల అండదండలతో.. అధికారుల సాహకారంతో ఈ భూమి ని కబ్జా చేస్తూ అమ్ముతున్నారు.





సర్వేనెంబర్ 789/1 గల 1200 గజాలు ప్రభుత్వ ల్యాండ్ కి ప్రైవేట్ ల్యాండ్ సర్వేనెంబర్ వేసి రిజిస్టేషన్ చేస్తున్నారు. కొంత కలం కబ్జా ఉండి.. వేరే ఎక్కడిదో ఇంటి నెంబర్, కరెంట్ బిల్ తీసుకొని రెగులర్ అమ్మేస్తారు. అధికారులకు ఎంత చెప్పిన రసూల్ ఖాన్ కుటుంబ సభ్యులు ఇచ్చే ముడుపులకు ఆశపడి మా గోడు పాటించుకోవటం మానేశారు అధికారులు. ఇకనైనా రసూల్ ఖాన్ కుటుంబ సభ్యుల ఆటలకు అడ్డుకట్టలు వేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుకుంటున్నారు సీతారామ కాలనీ వాసులు.



## ఎడతెరపిలేని వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశం

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 5**

బంగాళా ఖాతం లో ఏర్పడిన తీవ్ర తూఫాన్ ప్రభావంతో ఉత్తర, దక్షణ తెలంగాణా జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తోపాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబబాద్, సూర్యాపేట తదితర జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా సి.ఎస్. శాంతి కుమారి మాట్లాడుతూ, నేడు, రేపు రెండురోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు ఒక్కొక్క ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్, రెవెన్యూ శాఖ లు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా వరదలు వచ్చే అవకాశం ఉన్నందున కాజ్‌వె, లోతట్టు ప్రాంతాల వద్ద తగు జాగ్రత చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలని సి.ఎస్ శాంతి కుమారి సూచించారు.

# ముఖ్యమంత్రిగా రేవంత్ నియామకంపై హర్షం

- మూడు చింతలపల్లి మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, డిసెంబర్ 5:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నియమించడం హర్షణీయం అని మూడు చింతలపల్లి మండల ఎంపీపీ ఉపాధ్యక్షులు మంద శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఓటర్లు విశ్వసించారని, అందుకే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు ఆయన తెలిపారు.



అంతే కాకుండా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తుందని తెలిపారు. ఇక నూతన ప్రభుత్వ ఏర్పాటుకు అందరూ సహకరించాలని వారు కోరారు.

# రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

**జయభేరి, డిసెంబర్ 5:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఎన్నిక కావడం శుభ పరిణామం అని మూడుచింతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కల సాకారం కాంగ్రెస్ వల్లే సాధ్యమైందని, ఆ విశ్వాసం వల్లే ఈ ప్రాంత ప్రజలు తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి ని అధిష్టానం ప్రకటించడం పై ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని స్పష్టం చేశారు.





## ఉప్పల్ నూతన ఎమ్మెల్యే బండారి కి శుభాకాంక్షలు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్, గ్రేటర్ బారాసా నాయకులు సాయిజెన్ శేఖర్, నాచారం డివిజన్ సీనియర్ సిటిజన్స్, నాచారం డివిజన్ మహిళా నాయకులు ప్రీతి రెడ్డి, ఆదిలక్ష్మి, సుఖపాల పద్మావతి, సుజాత నిర్మల రెడ్డి, అజ్మీరా బేగం, జ్యోతి, సమీన్, జయమ్మ, సరస్వతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సైనిక్ పూరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వద్దకు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ డివిజన్ల నాయకులు. ఉప్పల్ ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డి ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు అభిమానులు.

**జయభేరి, కాప్రా**



నాచారం జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు నాచారం కార్పొరేటర్ స్టార్టింగ్ కమిటీ మెంబర్ శాంతి సాయిజేన్ శేఖర్ పిపి కిట్స్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిజన్ శేఖర్, విటల్ యాదవ్, బుచ్చి గౌడ్, జవాన్ కృష్ణ, ఎస్ఎఫ్ఏ లు యాకస్వామి, శ్యామల, రాజేష్, నరేష్, కార్మికులు ఉన్నారు.

**జయభేరి, కాప్రా**



మీర్పెట్ HB కాలనీ డివిజన్ జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు PP కిట్లు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభు దాస్, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, కాప్రా**



## ఉప్పల్ నూతన ఎమ్మెల్యే బిఎల్ఆర్ కు శుభాకాంక్షలు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన సీతారామ కాలనీ అధ్యక్షులు గూడూరి రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఉప్పల్ పల్లె రాజ్ కుమార్ గౌడ్, నర్సిమ్మ రెడ్డి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేసినారు.

# మాస్ మెచ్చేలా ఆడు మచ్చా..

రవితేజ నటిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఈ చిత్రంలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. కల్యాణచక్రవర్తి సాహిత్యంతో 'ఆడు మచ్చా..' అంటూ సాగే ఈ పాటను డేవ్ జాంద్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. గ్రామీణ వేడుకలకు అద్దంపట్టే ఊర మాస్ ఆంథమ్‌గా ఈ పాట ఉంటుందని, ఇందులో రవితేజ గెటప్, డ్రస్సింగ్ స్టైల్ విభిన్నంగా మాస్ మెచ్చేలా ఉంటాయని, నల్లచొక్కా, ధోతీ ధరించి, మెడలో రుద్రాక్షమాలతో పూర్తిగా రవితేజ కొత్త అవతారం ఈ పాటలో చూస్తారని మేకర్స్ చెపుతున్నారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా ఉంటుందని వారు చెబుతున్నారు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల ఇతర తారాగణం. ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా.



# నీ పద్ధతేం నచ్చలే!

నీకు నచ్చింది ప్రపంచానికి నచ్చాల్సిన పనిలేదు. ప్రపంచానికి నచ్చింది నీకు నచ్చాలని రూల్ లేదు. ఈ సోషల్ మీడియా యుగంలో అందరూ గ్రహించాల్సిన విషయం ఇది. సామాన్యుల పోస్టులకే కౌంటర్లు తప్పడంలేదు. ఇక సెలబ్రిటీల పోస్టుల విషయంలో ఎలా ఉంటుందో ఊహించుకోండి. అందుకే అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి కూడా భయపడుతుంటారు కొందరు సెలబ్రిటీలు. ఇటీవల త్రిష ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నది. మన్సుర్ అలీఖాన్ వివాదంతో సౌత్ ఇండస్ట్రీలో త్రిష ఓ చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆ వివాదం పూర్తిగా సద్దుమణగలేదనే చెప్పాలి. ఇంతలో మరో తలనొప్పిని తెచ్చిపెట్టుకుంది త్రిష. ఇటీవలే ఆమె 'యానిమల్' సినిమా చూసింది. ఆ సినిమా అమ్మడికి తెగ నచ్చేసినట్టుంది. ఆనందం ఆపుకోలేక 'యానిమల్' పోస్టర్‌ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, 'కల్ట్ మూవీ' అంటూ రాసేసింది. అంతే.. ఇక ఆ సినిమా నచ్చని వాళ్లంతా త్రిషపై దండెత్తారు. 'ఆడవాళ్లు.. హక్కులూ.. ఆత్మాభిమానాలూ అంటూ మాట్లాడతావ్.. ఇలా స్త్రీలను అవమానించేలా తీసిన సినిమాలను మాత్రం పొగిడేస్తుంటావ్.. నీ పద్ధతి ఏం నచ్చ లేదు.' అంటూ విమర్శలు గుప్పించారు. దాంతో ఈ వ్యతిరేకతను తట్టుకోలేక తన ఇన్‌స్టా స్టోరీని తొలగించేసింది త్రిష.





# హొయలొలికించిన తృప్తి డిమ్రీ

యానిమల్‌లో తన యాక్టింగ్ స్కిల్స్, స్టన్నింగ్ లుక్‌తో ప్రేక్షకుల మతి పోగొట్టిన బాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ తృప్తి డిమ్రీ ఇప్పుడు కోట్లాది ప్రేక్షకుల డ్రీమ్ గరల్‌లా మారిపోయింది. డిజైనర్ గౌరవ్ గుప్తా వైట్ పెర్ల్ లెహంగాలో మెరిసిన తృప్తి డిమ్రీ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆన్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకునే తృప్తి ఆఫ్ స్క్రీన్‌లోనూ స్టైలిష్ ఫ్యాషన్ ఐకాన్‌గా మెరుస్తోంది. ఇటీవల గౌరవ్ గుప్తా బ్యూటిఫుల్ క్రియేషన్‌లో తృప్తి డిమ్రీ హొయలొలికించింది. ఫైన్ క్రిస్టల్స్, పెరల్స్‌తో కూడిన ఐవరీ లెహంగాలో ది బ్రైడ్ సైడ్ సీజన్ 2 కోసం తృప్తి క్లాసిక్ అవుట్‌ఫిట్‌లో మెరిసింది. డ్రస్‌కు తగిన మేకప్‌తోనూ తృప్తి ఆకట్టుకుంది.



# యష్ జోడీగా సాయిపల్లవి

దక్షిణాది ఇండస్ట్రీలో సాయిపల్లవి పంథా చాలా ప్రత్యేకం. కథాంశాల ఎంపికలో కొత్తదనంతో పాటు తన పాత్రల్లో వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తుంటుంది. ప్రస్తుతం ఈ భామ వరుసగా పాన్ ఇండియా చిత్రాలను అంగీకరిస్తున్నది. రణ్‌బీర్ కపూర్ హీరోగా నితీష్ తివారీ దర్శకత్వంలో రామాయణ ఇతివృత్తంతో తెరకెక్కనున్న చిత్రంలో సాయిపల్లవి సీత పాత్రను పోషించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. అలాగే నాగచైతన్య తొలి పాన్ ఇండియా చిత్రం 'తండేల్'లో కూడా ఆమే కథానాయికగా నటిస్తున్నది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి మరో ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలిసింది. 'కేజీఎఫ్' సిరీస్ వంటి భారీ విజయాల తర్వాత కన్నడ అగ్ర నటుడు యష్ నటించబోతున్న తదుపరి సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా అప్‌డేట్ ఈ నెల 8న రానుంది.. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కబోతున్న ఈ సినిమాలో నాయికగా సాయిపల్లవిని ఎంపిక చేసినట్లు తెలిసింది.



# ఎట్టకేలకు ఇప్పుడు కుదిరింది

కల్యాణ్‌రామ్ మంచి హీరోనే కాదు, అభిరుచి గల నిర్మాత కూడా. తను ఎంచుకునే కథలే అందుకు నిదర్శనాలు. సురేందర్‌రెడ్డి, అనిల్ రావిపూడి, వశిష్ట.. ఈ ముగ్గుర్నీ దర్శకుల్ని చేసింది కల్యాణ్‌రామే. ప్రస్తుతం ఆయన అభిషేక్ నామా దర్శకత్వంలో 'డెవిల్' సినిమా చేస్తున్నారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత పవన్ సాదినేని దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. నిజానికి ఇది ఏనాడో అనుకున్న కలయిక. హరికృష్ణ జీవించివున్న రోజుల్లో కల్యాణ్‌రామ్, హరికృష్ణ కాంబినేషన్‌లో పవన్ సాదినేని ఓ మల్టీస్టారర్ కథను రాసుకున్నాడు. ఆ కథను కల్యాణ్‌రామ్ ఓకే చేశాడు కూడా. అయితే, హరికృష్ణ హఠాన్మరణంతో ఆ ప్రాజెక్ట్‌కు బ్రేక్ పడింది. ఇన్నాళ్లకు మళ్లీ వీరిద్దరూ కలిసి పనిచేయడానికి రంగం సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలోనే 'బింబిసార2' కూడా కల్యాణ్‌రామ్ చేయనున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com